క్లుప్తంగా

నేడు, రేపు తాగునీటి సరఫరా నిలిపివేత

నరసరావుపేట: పట్టణానికి తాగునీరు అందజేసే ప్రధాన పైపులైనుకు ఏర్పడిన లీకులను సరిచేసే నిమిత్తం మంగళవారం సాయంత్రం, బుధవారం ఉదయం, సాయంత్రం తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు సోమవారం పేర్కొన్నారు. గురువారం ఉదయం నుంచి యధావిధిగా సరఫరా జరుగుతుందని తెలిపారు.

బొల్లా శ్రీనివాస్‌కు మాజీ ఎమ్మెల్యే బొల్లా నివాళి



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలో బొల్లా శ్రీనివాస్ అకాల మరణాన్ని చింతిస్తు ఆయన పార్థివ దేహాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సందర్శించి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. శ్రీనివాస్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియాజేశారు. మాజీ ఎమ్మెల్యే బొల్లాతో పాటు నియోజక వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

సాహితీవేత్త రామబ్రహ్మంకు గౌరవ డాక్టరేట్



చిలకలూరిపేట: పట్టణానికి చెందిన సాహితీవేత్త దీవి రామబ్రహ్మంకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఆయన చేసిన సాహితీ కృషికి గాను తెలుగు సంస్కృతి, సాహితీ సేవా ట్రస్ట్ సంస్థ విజయవాడలో ఆదివారం నిర్వహించిన ఓ సాహితీ కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును అందజేశారు. రామబ్రహ్మం ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయుడిగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పని చేసి రిటైర్డ్ అయ్యారు. ఆయన మోక్షదర్శనం, ఆయుర్వేద వైద్యదర్శిని, వీరబ్రహ్మేంద్రస్వామి తత్వదర్శిని వంటి పలు గ్రంధాలు రచించారు. అనేక సామాజిక, సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సాహితీ సేవారత్న వంటి బిరుదులు అందుకున్నారు. రామబ్రహ్మంకు గౌరవ డాక్టరేట్ లభించటం పట్ల పట్టణానికి చెందిన సాహితీ వేత్తలు డాక్టర్ పీవీ సుబ్బారావు, దార్ల బుజ్జిబాబు, డాక్టర్ విన్సెంట్‌పాల్, ఏవీ శివయ్య అభినందనలు తెలిపారు.

పారదర్శకంగా తనిఖీలు చేయాలి

వినుకొండ(నూజెండ్ల): జాతీయ ఉపాధి పథకంలో జరిగిన పనులకు సంబంధించిన ఆడిట్ పనులు పారదర్శకంగా చేయాలని ఉపాధి పథకం రిసోర్స్ పర్సన్ జె.ఎస్.రాజు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని 27 గ్రామపంచాయతీల్లో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధి పథకం నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందాలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. గ్రామాల్లో సామాజిక బృందాలు తనిఖీలు చేసే సమయంలో ప్రజలు తమ వంతు సహకారం అందించాలన్నారు. 792 పనులకు సంబంధించి రూ.12 కోట్లు 10 లక్షల నిధులు వినియోగించినట్లు సమావేశంలో వివరించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో ఆంజనేయరాజు, వినుకొండ ఏపీవో కట్టా నాగేశ్వరరావు,పంచాయతీరాజ్ ఏఈ అల్లాభక్షు, హౌసింగ్ ఏఈ నరేంద్ర, పంచాయతీ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా రుణం రికవరీ చేయాలంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు

నాదెండ్ల: స్వయం సహాయక మహిళా సంఘంలో ఉన్న సభ్యురాలు గ్రూపు పరిధిలో ఉన్న బ్యాంకులోనే రుణాలు పొందాలని నిబంధన ఉన్నా అందుకు విరుద్ధంగా రెండు బ్యాంకుల్లో రుణాలు పొందిందంటూ స్థానికులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. అప్పాపురం గ్రామంలో చైతన్య గ్రామ సమాఖ్య వీవోఏగా పనిచేస్తున్న మహిళ సాయిబాబా మహిళా గ్రూపులో సభ్యురాలు. ఆమె కావూరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో బ్యాంకు లింకేజీ రుణం రూ.90 వేలు, స్త్రీనిధి రుణం రూ.1 లక్ష, సీఐఎఫ్ రుణం రూ.50 వేలు తీసుకుంది. అయితే ఇదే మహిళ తిరుపతమ్మ మహిళా గ్రూపులో సభ్యురాలిగా చేరి గణపవరం ఎస్‌బీఐలో రెండు నెలల క్రితం రూ.1.45 లక్షల లింకేజీ రుణం తీసుకుంది. నిబంధనలకు విరుద్ధంగా ఆమె రెండు బ్యాంకుల్లో రుణం తీసుకుందంటూ మహిళా గ్రూపు సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై నాదెండ్ల మండల శుభోదయ సమాఖ్య అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కుష్ఠు వ్యాధిపై సర్వే

శావల్యాపురం: శరీరంపై స్పర్శలేని రాగి గోధుమ రంగు మచ్చలు ఉంటే సత్వరమే వైద్య పరీక్షలు చేయించాలని వైద్యాధికారి అజిత అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి అజిత మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు వచ్చే నెల 2 వరకు అన్నీ గ్రామాల్లోని వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటి తిరిగి కుష్ఠు వ్యాధిపై సర్వే చేయాలన్నా రు. వ్యాధి లక్షణాలు నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ పరంగా ఉచితంగా వైద్య సేవలు మందులు అందజేస్తామన్నారు. అశ్రద్ధ చేస్తే అంగవైకల్యం వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్లు అలవలపాటి ఏడుకొండలు,ఉమాదేవి, స్టాఫ్‌నర్సు ధనలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ సీతారామిరెడ్డి, ఫార్మాసిస్ట్ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగు - లాభాలు బాగు

- హోస్టల్‌కాలనీలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయలు సాగు
- రెండు ఎకరాల్లో ఆకుకూరలు, కూరగాయల మడులు
- ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై ప్రజలు ఆసక్తి



విక్రయించేందుకు ఆకుకూరలను కోస్తున్న దృశ్యం



కూరగాయల మడులు

నరసరావుపేట రూరల్: సేంద్రియ వ్యవసాయం ద్వారా ఆకుకూరలు, కూరగాయలను సాగు చేస్తున్నాడు యువకుడు. పట్టణానికి సమీపంలో ఈ వ్యవసాయ క్షేత్రం ఉండటంతో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తుల పట్ల ప్రజలు ఆసక్తి కనభరుస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ ఉండటంతో నిరంతర ఆదాయంతో యువరైతు లాభాల సాగు చేస్తున్నాడు. రొంపిచర్ల మండలం ఎడ్వర్డ్‌పేటకు చెందిన కోడూరి వెంకటేశ్వర రెడ్డిది రైతు కుటుంబం. 10వ తరగతి వరకు చదివిన వెంకటేశ్వరరెడ్డి గతంలో పురుగు మందులో కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తూ గ్రామంలోనే ఆకుకూరలు, కూరగాయలు సాగు చేసేవాడు. ప్రకృతి వ్యవసాయ పితామహుడు సుభాష్ పాలేకర్ విధానాల పట్ల ఆకర్షితులై సేంద్రీయ వ్యవసాయం ప్రారంభించాడు. ఐదు సంవత్సరాల క్రితం పట్టణంలోని హోస్టల్‌కాలనీలో రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని సాగు ప్రారంభించాడు. నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నా పట్టువదల లేదు. పెట్టుబడి పెట్టి బోరు ఏర్పాటు చేశారు. డ్రిప్ ఇరిగేషన్ ప్రారంభించి నీటిని ఆదా చేస్తూ ఆకుకూరలు, కూరగాయలు పండిస్తున్నారు. పాలకూర, చుక్కకూర, బచ్చలి కూర, మెంతు కూర, తోట కూర, గోంగూర, కొతిమేరతో పాటు టమోట, వంగ, మిరప, బెండ, చిక్కుడు, కాకర, బీర, పొట్ల కాయలను సాగు చేస్తున్నారు.

కూరగాయలు కేజీ–50

సీజన్‌తో సంబంధం లేకుండా ఇక్కడ పండించే కూరగాయలు, ఆకుకూరలను ఒకే ధరలపై విక్రయిస్తున్నారు. బయట మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతున్నా ఈ క్షేత్రంలో మాత్రం కేజీ–50లకే విక్రయించారు. ఆకుకూరలు కట్ట రూ.10లకే అందిస్తున్నారు. ఆకు కూరలు నిరంతరం అందుబాటులో ఉండే విధంగా మూడు దశల్లో పెంచుతున్నారు. దీంతో కూరగాయలు కోసం వచ్చే వారికి నిత్యం ఆకుకూరలు అందుబాటులో ఉంటున్నాయి. పట్టణానికి సమీపంలోనే ఉండటంతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ అధికంగా ఉంది. కూరగాయలకు ఇక్కడకు వచ్చే వారు వారే స్వయంగా తమకు నచ్చిన కూరగాయలను కోసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులతో పాటు ధర కూడా తక్కువ కావడంతో ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు

రెండు ఎకరాల్లో సెంద్రియ సాగు కోసం దాదాపు రూ.2 లక్షల వరకు రైతు వెంకటేశ్వరరెడ్డి ఖర్చు చేశాడు. దీంతో పాటు ఆయన కుటుంబం అంతా ఈ వ్యవసాయ పనుల్లోనే నిత్యం నిమగ్నమై ఉంటారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ప్రచారం రావడంతో ఉదయం, సాయంత్రం సమయాల్లో కూరగాయల కొనుగోలు కోసం తరలివస్తున్నారు. ప్రతిరోజు రూ.2 నుంచి రూ.3వేల వరకు ఆదాయం లభిస్తుంది.

ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందించాలనే లక్ష్యం



వ్యవసాయం అంటే చిన్ననాటి ఇష్టం. దీనిపై ఆసక్తితో సెంద్రియ వ్యవసాయాన్ని ప్రారంభించాం. గత మూడు సంవత్సరాలుగా నీటి కొరతతో ఇబ్బందులు పడ్డా. ప్రస్తుతం నీటి కొరతను అధికమించడంతో దిగుబడులు పెరిగాయి. ఎటువంటి రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో కూరగాయలను సాగుచేస్తున్నాం.

–కోడూరి వెంకటేశ్వరరెడ్డి, రైతు

బడిబాట పట్టిన డ్రాపౌట్స్



బడిలో చేరిన డ్రాపౌట్స్‌తో హెచ్‌ఎం చిన్నయ్య

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: బడిబయట ఉన్న 20 మంది పిల్లలు బడిబాట పట్టారు. ఈ నెల 7వ తేదీన ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి మండలంలోని బొప్పూడి గ్రామాన్ని సందర్శించారు. అదేరోజు గ్రామంలోని ఎస్టీ కాలనీలో ఉన్న కుటుంబాలను కలిశారు. అక్కడి కుటుంబాల్లోని 20 మంది పిల్లలు బడిబయట ఉన్నట్లు గుర్తించారు. వారి తల్లిదండ్రులను ఇదే విషయంపై ప్రశ్నించగా, తమ పిల్లలకు ఆధార్, బర్త్ సర్టిఫికెట్లు లేని కారణంగా ప్రభుత్వ పాఠశాలలో చేర్చుకోవడం లేదంటూ ఆమె దృష్టికి తెచ్చారు. దీంతో కమిషన్ సభ్యురాలు పద్మావతి తహసీల్దార్, ఎంఈవో, ఎంపీడీవో, సీడీపీవోలకు సమస్యను పరిష్కరించి బడిబాట పట్టించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఎస్టీకాలనీకు చెందిన 20 మంది పిల్లలను స్థానికంగా ఉన్న ఏపి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ భూలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బడిబాట పట్టించారు. ఎస్సీ, ఎస్టీ అంగన్‌వాడీ కార్యకర్తలు టి.అరుణ, జి.కోటేశ్వరమ్మలు పాఠశాల హెచ్ ఎం ఎం చిన్నయ్యను కలిసి చేర్పించనట్లు తెలిపారు.

ప్రభుత్వ వైద్యశాలలో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్

- శంకుస్థాపన చేసిన జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే చదలవాడ, కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటుచేస్తున్న ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీ, అపోలో డయాలసిస్ యూనిట్‌లకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా వైద్యశాలకు రూ.1.30 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీని ఏర్పాటు చేయబోతున్నామ, అదేవిధంగా మరో రూ.36 లక్షలతో డయాలసిస్ యూనిట్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కొత్త పాలెం గ్రామం నుంచి కోటప్పకొండ వరకు రోడ్డు మరమ్మతుల కోసం రూ.4 కోట్లు ఉప ముఖ్యమంత్రి కేటాయించారన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణ అధికారి, స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బీవీ రంగారావు, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, టీడీపీ నాయకులు కపిలవాయి విజయి కుమార్, వాసిరెడ్డి రవీంద్ర, కూరపాటి శ్రీనివాస రావు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం గ్యాస్ ఏజెన్సీలు పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్‌నాయక్

వినుకొండ(నూజెండ్ల): ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ ఏజెన్సీలు పనిచేయాలని తహసీల్దార్ సురేష్‌నాయక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్యాస్ ఏజెన్సీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సకాలంలో వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా గ్యాస్ డెలివరీ చేయాలన్నారు. ఎటువంటి అదనపు చార్జీలు వసూలకు పాల్పడవద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేసే ఏజెన్సీలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ డీలర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీఎం మోడల్‌తో నిరంతర ఆదాయం



ప్రకృతి పంటలను పరిశీలిస్తున్న రామచంద్రం

రొంపిచర్ల: ప్రకృతి వ్యవసాయం ద్వారా నిరంతర ఆదాయాన్ని పొందవచ్చు అని ప్రకృతి వ్యవసాయ విభాగ రాష్ట్ర అధికారి రామచంద్రం అన్నారు. మండలంలోని తుంగపాడు గ్రామంలో రైతులకు సోమవారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏటీఎం మోడల్ వల్ల రైతులకు పెట్టుబడి తగ్గి దిగుబడులు పెరుగుతాయన్నారు. పంటలు సాగులో అంతర్ పంటలుగా తోటకూర, పాలకూర, మెంతికూర, చుక్కకూర, బీర, కాకర, టమాటా, బెండ, మిరప, సొర, పొట్లకాయలు, మునగ, బొప్పాయి లాంటి పైర్లను సాగు చేసి నిఖర ఆదాయాన్ని పెంచుకోవచ్చు అన్నారు. ఏటీఎం మోడల్‌గా చేస్తున్న వ్యవసాయంలో రైతులు నిరంతర ఆదాయాన్ని పొందవచ్చు అన్నారు. తుంగపాడు గ్రామంలో రైతులు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలించారు. రైతు స్వయంగా తయారు చేసుకుంటున్న జీవామృతం, వేపగింజల కషాయాలను పరిశీలించారు. మరిన్ని మెలకువలను, సూచనలను వారికి అందించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చాకలి మాన్యం ఆక్రమించిన వారిపై చర్య తీసుకోవాలి

- రజక సోదరులకు న్యాయం చేయాలి
- కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా చేసి మెమోరాండం ఇచ్చిన ప్రజాసంఘాలు



ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: వినుకొండ మండలం బ్రాహ్మణపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 90లోని 8.61ఎకరాల చాకలి మాన్యం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని రజక సోదరులకు న్యాయం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహించి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇటీవల రీ–సర్వే పేరుతో రెవెన్యూ అధికారులు ఈ భూములకు సంబంధం లేని వ్యక్తులకు వన్ బి, అడంగల్లులలో పేర్లు నమోదు చేశారని పేర్కొన్నారు. ఈ విషయంపై పలుమార్లు స్థానిక తహసీల్దార్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఎల్‌పీ నెంబరు 252తో వెంకయ్య కుమారుడు రవితో రెవిన్యూ అధికారులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడి అతని పేరుతో నమోదు చేసి పాసు పుస్తకాలు మంజూరు చేశారన్నారు. పీడీఎం సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి, కార్యదర్శి జి.రామకృష్ణ, రజక నాయకులు జాలలపాలెం మాజీ ఉపసర్పంచి సురభి వెంకటేశ్వర్లు, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పశువ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

పశుసంవర్థక శాఖ యడ్లపాడు ఏడీ డాక్టర్ వై.రాధాకృష్ణ



నట్టల నివారణ మందులు తాగిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

యడ్లపాడు: పశుపోషకులు చలికాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ యడ్లపాడు ప్రాంతీయ కార్యాలయ సహాయ సంచాలకులు డాక్టర్ వై.రాధాకృష్ణ చెప్పారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో సోమవారం ఉచిత పశువైద్య ఆరోగ్య శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిబిరంలో యడ్లపాడు ఏడీ వైరాధాకృష్ణతో పాటు స్థానిక పశువైద్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు పి రోజర్‌బెన్నీ, సిబ్బంది సత్యనారాయణ, రవి,ప్రకాష్‌రాజ్, జ్యోతి, దుర్గారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల): రూరల్ మండలంలోని నడిగడ్డ గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. పసుసంర్థక అధికారి కె. కాంతారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో వినుకొండ ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.స రోజదేవి, ఇన్‌చార్జి మండల పశువైద్యాధికారి డాక్టర్ డి.శివాజీ, అంబులెన్స్ డాక్టర్ ఎం. మనోజ్, పశువైద్యసిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శావల్యాపురం: గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను పాడిపోషకులు సద్వినియోగం చేసుకోవాలని నరసరావుపేట ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టరు రామచంద్రరావు అన్నారు. సోమవారం మండలంలోని వెలమవారిపాలెం, శానంపూడి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాలను సందర్శించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బీర్నేడి రత్నగిరి, పశువైద్యాధికారులు పాలపర్తి గణేష్‌కుమార్, సోముల గుణదీర్, రైతులు పాల్గొన్నారు.

రొంపిచర్ల: రైతాంగ ఆర్థికాభివృద్ధిలో పశుపోషణ ఒక భాగమని పశువైద్యాధికారి డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి అన్నారు. ఆరేపల్లి, విప్పర్లరెడ్డిపాలెం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాల్లో పాల్గొని మాట్లాడారు. శిబిరాల్లో భాగంగా 234 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశామన్నారు.

నాదెండ్ల: పశువులు ఆరోగ్యంగా ఉంటేనే పాడిరైతులకు నికరాదాయం లభిస్తుందని పశువైద్య సహాయ సంచాలకులు, యడ్లపాడు పశువైద్యాధికారి రాధాకృష్ణయ్య చెప్పారు. మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామంలో గణపవరం పశువైద్యాధికారి సీహెచ్ సాంబశివారెడ్డి, సాతులూరు గ్రామ పశువైద్యాధికారి డాక్టర్ శ్రీలక్ష్మీ సోమవారం ఉచిత పశువైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు

సంక్షిప్త వార్తలు

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

నరసరావుపేట: పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. వీటిలో సింధూ స్కూల్ వద్ద ఆర్‌సీసీ కల్వర్ట్ నిర్మాణం, హై లెవెల్ బ్రిడ్జి, మార్కెట్ యార్డులోని హెచ్‌డీపీఇ డిస్ట్రిబ్యూటర్ పైప్‌లైన్, చిత్రాలయ థియేటర్ నుంచి ఈశ్వర్‌మహల్ థియేటర్ వరకు యూజీడీ రీస్టోరేషన్ చేసే పనులున్నాయి. మునిసిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, డీఇ రఫీ, పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

చిలకలూరిపేట: రోడ్డు భద్రతా నియమాలు ఉన్నది మన ప్రాణ రక్షణ కోసమేననే వాస్తవాన్ని వాహనదారులు గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన వాహనాల ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కేఎల్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

సెలవు దినంగా ప్రకటించాలి

చిలకలూరిపేట: గిరిజన ప్రజల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించటంతో పాటు సెలవు దినంగా ప్రకటించాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి శ్రీను నాయక్ కోరారు. పట్టణంలోని ఎన్‌ఆర్‌టీ సెంటర్‌లో ఉన్న సంఘ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ సేవాలాల్ సుగాలీ ప్రజల జీవనాభివృద్ధి కోసం కృషి చేసిన మహనీయుడని తెలిపారు. వైద్యం లేని రోజుల్లో ము[illegible] ప్రజల ఆరోగ్య రక్షణకు ఆయన [illegible] తెలిపారు. ఇలాంటి మహనీయుడు జన్మించిన ఫిబ్రవరి 15వ తేదీని సెలవుదినంగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వడితే కోట్యానాయక్, ఎం వెంకటేష్ నాయక్, కె.వాగ్యానాయక్ పాల్గొన్నారు.

కే–రిడ్జి విద్యార్థులకు బహుమతులు

నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో కే–రిడ్జి పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ జి.బర్నబాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు కిషోర్ సోమవారం తెలిపారు. ఏరో స్కేట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని షిరిడిలో నిర్వహించిన 10వ జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలో అండర్–14 విభాగంలో తమ విద్యార్థులు కర్ణం కార్తికేయ, నందిపాటి మోక్షిత్, షేక్.మొహమ్మద్ వహీద్, కాకర్ల మోక్షరామ్‌చరణ్‌లు ఏరోబాల్ గ్రూప్ ఈవెంట్‌లో ప్రథమ బహుమతి, కర్ణం కార్తికేయ జిగ్‌జాగ్ విభాగంలో తృతీయ బహుమతి సాధించినట్టు వివరించారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, స్కేటింగ్ కోచ్ ఫిరోజ్‌ఖాన్, క్యాంపస్ ఇన్‌ఛార్జి కోట బాపూజీ, అకడమిక్ కోఆర్డినేటర్ పుట్ట హేమంత్ అభినందించారు.

ప్రకృతి వ్యవసాయం మేలైంది

బొల్లాపల్లి : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేకూరుస్తాయని తహసీల్దార్ ఏపీ సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంటీ తిరుపతి రావు, యూనిట్ ఇన్‌చార్జి హనుమంత రావు, లక్ష్మనాయక్, సిబ్బంది కోటిరెడ్డి, దానయ్య, ఇమామ్, పాల్గొన్నారు.

పథకాలు అమలు చేయాలి

నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం నుంచి భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన పెండ్లి కానుకలు, ప్రమాద, సహజ మరణాల లబ్ధి వెంటనే అమలుచేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి భవన నిర్మాణకార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

క్రైం న్యూస్

పొలానికని వెళ్లి మృతుడయ్యాడు!



శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామానికి చెందిన బొల్లెపల్లి చినమల్లయ్య (73) ఈనెల 16న పొలానికి వెళుతున్నట్లు కుటుంబ సభ్యులు సమాచారం అందించి వెళ్లాడు. అదేరోజు సాయంత్రం 5 గంటల సమయం అయినా ఇంటికి రాకపోవటంతో భార్య భారతమ్మ చుట్టుపక్కల కుటుంబాలకు వారికి బంధువులకు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా వెతుకులాట ప్రారంభించారు. గ్రామంలోని ఏబీసీ కెనాల్ సమీపంలో బొల్లెపల్లి చినమల్లయ్యకు చెందిన చెప్పులు కనిపించటంతో పోలీసులు, రీస్క్యూ టీం, రెవెన్యూ అధికారులు, కుటుంబ సభ్యులు కాల్వ వెంట వెతుకులాట గత నాలుగురోజుల నుంచి చేస్తున్నారు. ఈక్రమంలో ఎట్టికేలకు బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామ సమీపాన కెనాల్‌లో చినమల్లయ్య మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు తెలిపారు. కుటుంబ సభ్యులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లోకేశ్వరరావు తెలిపారు.

బైపాస్‌పై కారుబోల్తా



యడ్లపాడు: చిలకలూరిపేట బైపాస్ హైవే వంతెనపై అదుపుతప్పి కారు బోల్తా కొట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా నుంచి ప్రకాశం జిల్లా దొనకొండకు వెళ్తున్న ఇన్నోవా కారు సోమవారం తెల్లవారుజాము 4.30 గంటల సమయంలో ప్రమాదవశాత్తు అదుపుతప్పింది. యడ్లపాడు మండలం తిమ్మాపురం వద్ద హైవే బైపాస్ ఎక్కి కొద్దిదూరం ప్రయాణించి తర్వాత ఈ ప్రమాదం జరిగింది. వేగంగా ఉన్న కారు డివైడర్‌ను ఢీకోనడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రకాశం జిల్లా మండల కేంద్రమైన గిద్దలూరు నల్లబండ్ల బజారుకు చెందిన కారుడ్రైవర్ సింగిశెట్టి బాలఉగ్రకు తీవ్రగాయాలు కాగా, వెనుక సీట్లు ప్రయాణిస్తున్న వారికి స్వల్పంగా గాయాలయ్యాయి. దీంతో డ్రైవర్ బాల ఉగ్రను 108 వాహనంలో గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ప్రాణాపాయం లేదని, డ్రైవర్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.బాలకృష్ణ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి



నరసరావుపేట రూరల్: రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన యల్లమంద బైపాస్ జంక్షన్ వద్ద ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు యల్లమంద గ్రామానికి చెందిన షేక్ జానీభాషా(48) పట్టణంలో ఆటోనడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి పట్టణంలో పని ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో బైపాస్ జంక్షన్ సమీపంలో ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో జానీభాషాకు తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కిశోర్ తెలిపారు.

ఎక్కడివాడో.. ఇక్కడ కడతేరాడు!

నరసరావుపేట టౌన్: ట్రాక్టర్ ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది.. ఒన్‌టౌన్ సీఐ అరుణ తెలిపిన వివరాల ప్రకారం గత శుక్రవారం ఓ వృద్ధుడు పల్నాడు రోడ్డులో విజేత సూపర్ మార్కెట్ ఎదురు రోడ్డుదాటుతుండగా రావిపాడు వైపు వెళుతున్న ఏపీ 35టిఇ 6341 నంబర్ గల ట్రాక్టర్‌ను డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నిర్లక్ష్యంగా నడుపుకుంటూ వచ్చి ఢీకొన్నాడు. దీంతో తలకు తీవ్ర గాయమైన ఆ వృద్ధుడు స్పృహ లేకుండా పడిపోయి ఉండగా, అక్కడున్న ప్రత్యక్ష సాక్షులు 108 అంబులెన్స్‌లో గవర్నమెంట్ హాస్పిటల్‌కు పంపించారు. అతను చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. దీనిపై ప్రత్యక్ష సాక్షి కటికల నాగరాజు ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సదరు చనిపోయిన వ్యక్తి యాచకత్వం చేస్తూ జీవిస్తున్నాడని, ఆ వ్యక్తి ఆచూకీ తెలిసినవారు ఒన్‌టౌన్ సీఐ చరణ్, తనను గాని సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

వీఆర్వో రవినాయక్ సస్పెన్షన్

బొల్లాపల్లి : మండలంలోని సరికొండపాలెం వీఆర్వో జె.రవినాయక్‌ను కలెక్టర్ పి.అరుణ్‌బాబు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు అందాయని తహసీల్దార్ ఎ.వి. సుధాకర్ సోమవారం తెలిపారు. గ్రామ రెవెన్యూ పరిధిలో 191/1, 191/2 సర్వే నంబర్లలో 12.50 ఎకరాల భూమి అక్రమాల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురైనట్లు తహసీల్దార్ తెలిపారు.

నేడు దివ్యాంగ పింఛన్ల సర్వే

యడ్లపాడు: పింఛన్‌దారుల పొట్టకొట్టేందుకు కూటమి సర్కార్ కుట్రలు పన్నుతోంది. వెరిఫికేషన్ పేరుతో ప్రత్యేక వైద్యబృందంతో సర్వే చేయిస్తున్న విషయం తెలిసిందే. మండలంలోని మొత్తం 20 గ్రామ పంచాయతీ కేవలం 31 మంది మాత్రమే రూ.15 వేల పింఛన్ సొమ్ము అందుకుంటున్నారు.